
# కోమలి నవ్వింది





ఆ రోజు నిద్రలేచేసరికి సన్నగా కోమలివైన కంఠం వకటి లోపలి నుంచి వినపడింది. బద్ధకంగ ఒళ్ళువిరుచుకున్నాను.

అదేకంఠం యింకా వినిపించింది.

'ఎవరు?' అని విస్తుపోయాను. మాసుబ్బులికి తనలో తాను మాట్లాడుకునే అలవాటులేదు. అంత ప్రొద్దుటివేళ యింకొక కోమలి కంఠం మాయింట్లోకివచ్చి వినబడే అవకాశం అంతకంటే లేదు.

ఈసారి మగగొంతుక విన్పించింది. ఈసారి యింకా ఆశ్చర్యం కలిగింది. దాన్ని అలాగే దాచుకుని దంతదావన కార్యక్రమం పూర్తిచేసే ఉద్దేశ్యంతో వసారాలో అడుగుపెట్టాను. సుబ్బులు అక్కడలేదు. బాత్‌రూమ్‌లో బడబడా చెంబుతో నీళ్ళుపోసుకుంటున్నట్లు చప్పుడయింది. ఆ కోమల కంఠమూ, పురుషస్వరమూ రెండూ మెలివేసుకుని పారిపోయాయి. నిశ్చేష్టుణ్ణయాను నేను.

ముఖం కడుక్కుని మళ్ళీ మాటలు వినిపిం

**పోరంకి దక్షిణామూర్తి**

థాయి. వినిపించటం మానేసే లోగానే వసారాలోకి వెళ్ళి వడాలవి అంగలో రెండు గడపలు దాటి వెళ్ళాను.

అప్పుడే స్నానం చేసి ఒళ్ళు తుడుచుకుంటున్న సుబ్బులు ఒక్కసారి ఉలిక్కిపడ్డది. అలా నవ్వేసి ముడుచుకుపోయింది. ఆ నవ్వు బిగ్గరగానే వినిపించింది.

అసలుమిస్టరీ యిప్పుడు బయట పడింది. ఆ స్త్రీ, పురుషకంఠాలు రెండూ మాగోడదూరే ప్రక్కయింటి వసారాలో కీచులాడుకుంటున్నాయి.

ముందు స్త్రీ కంఠంస్థాయి హెచ్చింది. తగువిధంగా పురుషుడున్నూ ఉచ్చలోకి వెళ్ళాడు.

నోటిమాట రాక, చేతులూ కాళ్ళూ కదలక చేష్టలుడిగి ,నిరీహుణ్ణయి నిలుచున్న నన్నుచూసి సుబ్బులు యింకా నవ్వింది.

పురుషస్వరం పోర్షను అయిపోయింది.కోమలి ఆ అదును చూసుకుని విజృంభించింది.

మీరిలామాట్లాడబట్టే నేను అందరికీలోకు వయ్యాను. విన్న వాళ్ళు నవ్వుతున్నారంటే ఆశ్చ ర్యం ఏముందీ? మీరు నాటకం రిహార్సల్సుకివెడితే నాకేం, మరోచోటుకువెడితే నాకేం?ఇల్లు అంటూ ఏడిసింది కనుక అర్ధరాత్రికేనా వచ్చారు. మీ యిష్టంవచ్చినట్లు మీరు తిరగొచ్చుకానీ, నేను ఏమని అడిగేసరికి నామీద విరుచుకుపడతారు. నవ్వేవాళ్ళకి యిది పెద్దముచ్చటకాదూ? ఇక దుఃఖం పట్టలేక యేడ్చింది కూడా.

చీరకట్టుకుంటున్నసుబ్బులు అలాగే కొయ్యబారి పోయింది గ్రీకుదేవతలాగ.

తరువాత మళ్ళీమాటలు వినిపించలా.

ఆ యింట్లోకి మేమువచ్చి వారం రోజులు కాలేదు. ఇంతవరకూ ఆకీచులాటలు మాకెప్పుడూ వినిపించలేదు. ఆ ప్రక్క యింటాయనపేరు నాకు తెలీయదు. ఆవిణ్ణిమాత్రం ఒకటిరెండు సార్లు చూశాను. మా సుబ్బులుకి పేత్తనాలకి వెళ్లే అలవాటులేదు. నేను ఆఫీసునుంచి యింటికి తిరిగి వచ్చిన సమయాల్లో మా ముందు గదిలో సుబ్బులుతో ఆవిడ పిచ్చాపాటి మాట్లాడుతూ ఉండగా చూసి ఉన్నాను.

ఆవిడపేరేదో చెప్పింది సుబ్బులు. అందమైన ఆడవాళ్ళపేర్లు అందంగా ఉండవు. కవక నేను వాటిని జ్ఞాపకం ఉంచుకోవటానికి ప్రయత్నించను. ఈమెగారూ అంతే. పల్చగా పాలరాతి విగ్రహంలా దృఢంగా ఉంటుంది. నేనుకూడా ఒకానొక సుబ్బులుకి భర్తనే కనుక ఈమె అందానికి కీలకస్థానాలు సరిగాచూడ్డం 'గిల్టి'గా ఫీలయ్యాను. తలవంచుకునే తప్పుకునేవాణ్ణి.

అవసరం వచ్చింది కనుక ఈమెకు కోమలి అని పేరు పెట్టుకున్నాను.

ఈ వారంరోజుల పరిచయంలోనే సుబ్బులూ, కోమలీ బియ్యమూ రాళ్ళూలాగ కలిసిపోయారు. సుబ్బులిది అదొక చాతుర్యం. అది ఎక్కడఉంటే అక్కడే, యిరుగుపొరుగు వాళ్ళతో యిట్టే కలిసిపోగలదు. వారివారి తరహాల్నిబటి బామ్మ పిన్నిగారూ, అత్తయ్యగారూ, ఒదినగారూ,



తొ లు త న వి ఘ్న మ స్తు మ ను చు ....

చెల్లాయీ, మరదలూ అంటూ వరసలుపెట్టి పిల్చేది. ఆ లెక్కని చూస్తే నాకు ఉన్న చుట్టాలకంటె ఆమెగారి బంధువులే ఎక్కువ. ఆనేరు మాత్రం నాకురాదు.

దాని ధర్మమాఅని యీవూరు వచ్చాక నాలుగు యిళ్ళుమార్చాను. ప్రతీ వాళ్ళకీ చనువు యివ్వడమేకాక చిన్నచిన్న అప్పులుకూడా యిచ్చేది. ధనరూపంలోనూ, వస్తురూపంలోనూ కూడా. నెలకు సరిపోయే సరుకులు లెక్కవేసితెస్తే యిరవై రోజుల్లోనే అయిపోయేవి. ఆవిడగారిది భారీ చెయ్యిమరి. ఏవంటే నవ్వేది. వరసకు బామ్మలూ, వరసకు పిన్నిగార్లు తెల్లవారితే అరడజను మంది వచ్చి యోగక్షేమాలు కనుక్కని వెళ్లేవారు. ఎవరింట్లో అయినా శుభకార్యాలు జరిగేయంటే యింక వేరే చెప్పక్కరలేదు. అవకాశానికి అంది నంతమట్టుక్కు ఏదో ఒక బహుమతీ తెచ్చియిచ్చే

కాని చేతులు ఊరుకోవు. ఈబాధ పడలేకనే మూడిళ్ళు మార్చాను. యిది నాలుగో యిల్లు. కొంచెం అద్దె ఎక్కువ. అయినా ఒకరితో సంబంధం పెట్టుకో అక్కరలేదు. అవిషయం స్పష్టంగా చెప్పేశాను. నామాట పూర్తి కాకుండానే నవ్వేసింది!

మొదటిరోజున కోమలిని చూసినప్పుడు నేనొకటి బాపతు మనిషేనేమో అని అనుమానం కలిగింది. నా అనుమానం నిలడేలోగానే ఆవిడ మంచితనం గురించి అరడజను ఉపన్యాసాలు ఒక్క పూటలో దంచింది మా సుబ్బులు. ఆ అమ్మాయి భర్తకి రైల్వేలో ఉద్యోగమట. జీతం సుమారుగా నాకు వచ్చినంతా వస్తుందట. ఆ అమ్మాయికి చిన్నతనంలోనే పెళ్లి అయిందట. మొగుడికి కొంచెం బట్టతలట. లావు అద్దాల కళ్ళజోడు పెడతాడట. మంచివాడేనట కూడా! ఆయన

కంచితనం ఈయావిడగారికి ఎల్లా తెలిసిందో మరి!
ఇంతకీ చెప్పొచ్చే మాటేమిటంటే ఆవిడకు పిల్లలు లేరట!

"సుఖపడింది!" అన్నాను.

"మీరు మహా యిప్పుడేం కష్టపడిపోతున్నారో యీ ఒక్క పిల్లాడితోటీ?"

నవ్వాను. తను వెక్కిరించింది. నేను మళ్ళీ వెక్కిరించేలోగానే ఆఫీసుకు టైమవటం గుర్తుకువచ్చి లేచేశాను.

ఆ మర్నాడు కోమలిగారింట్లోంచి తెచ్చిన కొత్త ఆవకాయ వాకంచంలో వేసింది.

"బ్రహ్మాండంగా ఉంది!" అన్నాను.

"మరే! పొరుగింటివాళ్లవన్నీ మీకు బ్రహ్మాండంగానే ఉంటాయి. ఇంతకీ, యిది ఆవిడపెట్టినది కాదులెండి. వాళ్ల అమ్మగారింటి నుంచి తెప్పించింది.

తెల్లబోయాను.

"వాళ్లాయనకి రైల్వేలో ఉద్యోగం కనక చిక్కానా, దేశం అంతా కానీఖర్చు లేకుండా తిరుగుతాడు. తెచ్చేవాళ్లుంటే మా అమ్మ పంపిస్తుందీ!"

"సరే, నాక్కూడా రైల్వేలో ఉద్యోగం రానీ!'

నా బుగ్గలు పొడిచేదేకానీ, వొళ్లోకూర్చున్న చిట్టిగాడు చీర తడుపడంతో చటుక్కున లేచి నిల్చుంది. దేవుడు రాజును రక్షించెను.!

చిట్టిగాడి ధర్మమా అని అదీ విడిచేసి సుబ్బులు తెల్లచీర కట్టుకుని వొచ్చింది.

తరవాత వసారాలో పడక కుర్చీలో కూర్చుని వాళ్ళ డల్‌గా సిగరెట్ కాల్చుకుంటూ ఉండగా మళ్లీ ఎందుకో గుర్తువచ్చింది.

"ఏమే!"

సుబ్బులు హెూరుగాలిలా వచ్చింది. ఉన్న చిట్టిగాడి గుడ్డలు జాడిస్తుందేమో, అల్లా ఒకచేత్తో గుడ్డా, రెండోచేత్తో సబ్బుముక్కా పట్టుకు చక్కావచ్చింది. చెమట బొట్లు ముఖం మీద ముత్యాల్లా నిలబడ్డాయి. జుట్టు రేగిపోయి కిరీటంలా పైకిలేచింది. ఆ అవతారం చూసేసరికి నానోట మాటరాలేదు.

"ఏమండీ! ఎందుకూ పిలిచారూ ?"

"అబ్బే, ఏంలేదూ!" అని తెల్చేశాడు.

"ఏంలేకపోతే పనిపాటా ఎందుకా అరుపులూ ?"

"అది కాదే! అసలు ఆ కోమలితో నీకు మొట్టమొదటి పరిచయం ఎల్లా అయిందో అడుగుదామని పిల్చాను."

"ఏ కోమలీ ? ఎవరంటే ఆమె ?"

నాకు వొళ్లుతెలిసొచ్చింది. నవ్వు ఆగింది కాదు.

"కోమలి ఎవరో, కొయ్యముక్క ఎవరో నాకేం తెలుస్తుందీ ? ఇరవై నాలుగ్గంటలూ పూరట్టి తిరిగేవారు మీరె తెలియాలి! నాకు చెబుతారు కూడానా ?"

అందరి ఆడవాళ్లలాగె మా సుబ్బులుకి కూడా కొళ్లసొంతంత అసూయ ఉన్నా, అప్పట్లో వశాత్తూ అది మాటల్లోనేకాని, చేతల్లో అభివ్యక్తం చెయ్యదు. భవతు!

"మా ఆవకాయ బ్రహ్మాండంగా లేదూ ?"

"ఆఁ ఏదా ? బాగానే ఉంది సరసం!" అంటూ విసవిసా లోపలికి వెళ్లిపోయింది.

సుబ్బులిదిగా ప్రత్యేకంగా చెప్పుకోవలసిన గొప్పలక్షణం ఏమిటంటే ఎప్పుడు ఎలాచిత్రా బుసన్నా మంటూఉన్నా భోజనకాలంలో గోవింద నామస్మరణని మించిపోయేటట్లు పేలుతూ, తిండికంటె కబుర్లతో కడుపు నింపుతుంది. ఎందుకంటే, నేను తిండి ఎక్కువతినలేనని దానికి తెలుసు. ఏకశయ్యాంతివర్తిని అయినప్పుడు అర్ధరాత్రివేళ చిట్టిగాడు నిద్రలేచినా, మంచి నిద్రవేళ తెల్లవారుగట్ల పాలవాడు తలుపులు బదబదా బాదినా, నేను మరో అందమైన అమ్మాయిని గూర్చి ఉత్సాహంగా ముచ్చటిస్తూ ఉన్న దానికి వచ్చే కోపోచ్ఛ్వాసము భోజనాలకు అర గంట ముందుగానే లైన్‌క్లియర్ యిస్తుంది. లేకపోతే, దాని వల్లవచ్చిన "ప్రేమ"తో కిర్రి బిక్కిరి అయి సన్యాసం స్వీకరించవలసి వచ్చేది. నాకు. ఆ కోపోచ్ఛ్వాసమే యిరుపక్షాలనుంచీ వచ్చినట్లయితే యుగళగీతం అవుతుంది.

శోభస్కరమైన ఆనాటి రాత్రి, వసారాలో వెన్నెట్లో కూర్చుని భోజనం చేస్తూ ఉండగా కోమలి విషయం సవిస్తరంగా చెప్పింది. అను మానాలు వస్తే తిరిగి ప్రశ్నించు కోవడానికికూడా అవకాశం యిచ్చింది సుబ్బులు.

కొత్త యింట్లోకి మేము మారేసరికి యిల్లంత చిందర వందరగా వుంది. ఆయింట్లో మాకు ముందు నివసించివున్న ఒకానొక గుమస్తా గారి పిల్లలు ఆ గోడనిండా మేకులుకొట్టి చిల్లులు వేశారు. ఇంటికి వెల్లవేసి మూడేండ్లయింది. ఎప్పుడూ యింట్లో లక్ష్మి తాండవించడానికి అనువుగా ఆ యిల్లాలు బూజులు దులపకుండా వుంచింది, గోడలు. ఆ యింట్లో మేము గృహ ప్రవేశం చేశాం. చేసినరోజునే మా సుబ్బులు కోమలిగారింటికివెళ్ళి బూజులు దులుపుకునే కర్ర ఎరువు అడిగిందట.మాపుట్టుపూర్వోత్తరాలు అప్పుడే అడిగి తెలుసుకుని ఆ అమ్మాయి తెచ్చి యివ్వబోయిందట. ఇవ్వబోతూనే అనుమానించింది.

"అయ్యగారూ! యీ వేళ మంగళవారంకదా బూజు దులపడం అంత మంచిది కాదేమో!' అందట.

దానికి బ్రహ్మానంద పడిపోయింది సుబ్బులు. ఇంత పరోపకారబుద్ధి వున్న కోమలి అంటేవి సుబ్బులుకి కృతజ్ఞత కలగదు కనుక?

వెల్ల వేయించడానికి రప్పించిన కూలివాళ్ళను తరగకొట్టేసింది. వాళ్ళ కెక్కడో పని కుదరటం వల్ల మళ్ళీ నాలుగు రోజులవరకూ వాళ్ళు రాలేదు.

బూజుకర్రతో ప్రారంభమయిన వారి స్నేహం దినదినాభివృద్ధి పొందటం, ఆవకాయ వాయినాల వరకూ వచ్చింది. మా ఆత్యధిక ఆశ్చర్యానికి ఒక రోజు వాళ్ళ యింట్లోంచి పాత ఉసిరికాయ పచ్చడికూడా తెచ్చి వేసింది. ఇటువంటి కోమలి అంటే ఎవరికి అభిమానం కలగదూ?

"వాళ్ళాయన మిమ్మల్ని గురించి అడిగారంటండి! పోనీ ఒకసారి వెళ్ళి పిచ్చాపాటీ, మాట్లాడరాదూ?" సుబ్బులు నన్ను ప్రోత్సాహపరచింది.

నేను వెళ్ళలేదు.

ఆ రోజు సాయంత్రం ఆయనే మా యింటికి వచ్చాడు.

కొంచెం బొద్దుగా వుంటాడు. బట్టతల కళ్ళద్దాలూ,నిముషానికి యిరువైసార్లు పైకెగురుతూవుండే కనుబొమలూ, చామనఛాయ ముఖమూ.

కోమలిగారి మొగుడని తెలిసి కొంచెం అసూయపడినా "నా ముందు యీయన్ని చూసినమాత్రం అసూయ పడనక్కర లేదు.'

ఆయన అన్నాడు. "మా ఆవిడ చెప్పింది. మీరు కామర్సు డిపార్టుమెంటులో పనిచేస్తున్నారటకదూ! వెనుక యీ యింట్లోనే సత్యనారాయణమూర్తిగారు ఉండేవారు లెండి. ఆయన ఎగ్రికల్చరులో ఉండేవారు. పెద్ద తెలివైనవాడేం కాదని వాళ్ళ ఆఫీసులో చెప్పుకుంటూ వుంటారు. డ్రామాలంటే అసలే యింటరెస్టు లేదు. "

నేను నవ్వాను. డ్రామాలంటె ఒకవిధంగా నాకు యిష్టమె. అయితే, ఆడిటోరియం కంటె గ్రీన్‌రూం కళాభిమానికి అనువయిన స్థలం.ఎందుకని అడక్కూడదు. అనుభవం వుంటె వాళ్ళకె తెలుస్తుంది. ఆ విషయం కోమలరావుగారు మాడా ఒప్పుకుంటారు. కోమలరావుగారంటె కోమలి భర్తగారు. కోమలినిబట్టే కాకుండా మిసమిస మెరిసే ఆయన నెత్తిమీదరు పలుకనేడా ఆపేరు ఆయనకు బాగా నప్పుతుంది. గ్రీన్‌రూం వ్యావాతావరణంలో స్త్రీ పాత్ర విహారం చేస్తూ వుంటాడు కనుక, ఆయనకు యింకో విషయం కూడా తెలుసు. అనుభవజ్ఞుడు కదా మరి! నాటకాల్లో ఆడపాత్రల తాలూకు బామ్మలూ, పిన్నిగార్లూ, బాబయ్యలూ. మామయ్యలు పొంది వున్నప్పుడు మాత్రం మేకప్‌గా ఉండడానికి వీలు లేదు. వేషం కట్టలోగా యుగళ గీతాలు పాడకూడదు. ప్రేమసన్నివేశం పునరావృత్తి చేసుకోకూడదు గదుల్లో ఒకరి కొకరు మేకప్ చేసుకునే టప్పుడు చెంప, లెక, నాభి దూరంలో ఉండే ఆభరణాలు వేయాలి. టైము చాలనందువల్ల అతి ముఖ్యమయిన విషయాలు మెల్లిగా మాట్లాడుకునేముందు వెలుపలి తాషామర్పాలు పెట్టించాలి. ఈ విషయాలన్నీ ఎందుకు మాట్లాడానంటె కోమలరావుగారు నాటక రంగానికి సంబంధించిన విషయం ఏది మాట్లాడినా మనమంతా వింటూ ఉంటాడు.

వెనుక గదినుంచి మా సుబ్బులు సకిలించింది. హుటాహుటిని వెళ్ళారెండు కప్పులతో కాఫీ అందుకున్నాను. ముందు నా కప్పు నేను చూడబోతు వుండగా, ఒక అంగా ఉప్పు అని అర్థం— వారించి కోమలరావుగారివైపు చూపించి, సైగ చేసింది.

ఇద్దరం కాఫీ తాగాం. మరి కాస్సేపు కూరుని

అంతకుతగినట్లుగామాట్లాడిసెలవు తీసుకున్నాడు. ఆయనకు సెలవు శాంక్షనుచేసి, నేను కుర్చీలో వాలాను. తీరిగ్గా నేను కుర్చీలో పడుకుంటే వాడి పుట్టి ఏదో మునిగి పోయినట్లు నన్నుచూసి ఎత్తుకోమంటూ, రణగుణధ్వని చేశాడు. మా వాడు. నేను కదుల లేదు. ఇంతలో మా ఆవిడే వచ్చి వాణ్ణి నా వొళ్లోకు తోసి, రూక్షణ వీక్షణాలతో నన్ను మందలించినంత పని చేసింది. అంతటితో సరిపెట్టింది కదా అని సంతోషించాను.

కోమలి గురించి నేను ఆలోచిస్తున్నట్లు సుబ్బులు కనిపెట్టడం నాకు యిష్టం లేదు. వచ్చే ప్రమాదం ఏమీ లేకపోయినా, యీ విషయం పోయికెళ్ళి కోమలి దగ్గర చెప్పేస్తుందేమోనని భయం. ఇటువంటి సున్నితమయిన విషయాల పట్ల చాలా జాగ్రత్తగా ఉండటం అవసరం. ఇంతలో రువ్వుమని దూసుకుంటూ వెన్నెల తెరలా వచ్చిపడింది కోమలి. ముఖమంతా కళ్ళు చేసుకుని అలానే చూస్తూ వుండిపోయాను.

కోమలి నవ్వింది.

ఆ నవ్వు కేవలం స్నిగ్ధంకాదు. మృదు చంద్రిక కాదు. చరచరా ప్రవహించే పాదరసం వంటిదీ కాదు. నీటిజాలు కాదు, గాలికి కదిలే తెల్లకలువ రేకు వంటిదీ కాదు. ఇంతసేపటినుంచి యిలాగ చూస్తూవున్నా, ఆ నవ్వు ఎటువంటిదో సరిగా నిశ్చయించుకోలేక పోయాను. నాకు గుర్తువున్నది ఒకటే. కోమలి నవ్వింది.

ఆమెను చూడ్డంతోనే చిట్టిగాడు చేతులు చాచాడు. నడుం విరిచి, వెనక్కువాలి, చేతులు ముందుకు చాచింది. ఆ సమయంలో నా దృష్టి చిట్టిగాడిమీద లేనే లేదు. ఆ నవ్వు తేలే ఎర్రని పెదాలమీద వుంది. ఆపెదాలకు బెత్తుడు పైగా మెరిసే కళ్ళల్లో కదిలే ఉత్సాహం మీద ఉంది.

చటుక్కున ముందుకు వంగి, వాణ్ణి తీసుకుని మళ్ళీ నవ్వింది. చిట్టిగాడునాకు టాటా కొట్టాడు కోమలి మళ్ళీ నవ్వింది.

తెల్లబోయిన నేను సుబ్బులు వచ్చి గడ్డంమీద చెయ్యి వేసుకుని తదేకంగా నావైపు చూసేవరకూ నా రంగు నేను మళ్ళీ తేల్చుకోలేక పోయాను.

ప్రక్కయింట్లోనుంచి కిలకిలలు వినపడేసరికి సుబ్బులు కళ్ళు మిలమిలా త్రిప్పి నా మీద ఎంతో ఆశ్చర్యం వలక బోసింది. నేను తలొంచుకున్నాను.

"అదా సంగతి!" అంటూ పొడవుగా సాగదీసింది. ఆ సంగతేమిటో నా కేమీ అర్థం కాలేదు.

చిట్టిగాడు ఆ పూట వాళ్ళింటినుంచి వచ్చే సూచనలు కనుపించకపోయేసరికి తానేవెళ్ళి వాణ్ణి తీసుకువచ్చింది. వాడు మంచి నిద్దట్లో వున్నాడు అప్పటికి.

ఇంత కలివిడిగా వున్నవాళ్ళు చిన్న విషయంలో విడముఖం, పెడముఖం పెట్టుకుంటారని వూహించలేక పోయాను. కలహానికి కారణం మొగుడు కొట్టినందుకు కాదట! తోడికోడలు నవ్వినందుకు. ఆ రోజున ఉదయం కోమలి [illegible] గురించి నేను చేసిన ఉపహాసానికి సుబ్బులు నవ్వింది. ఆనవ్వు ఆమెగారి చెవిన పడింది. అప్పుడిక ఏడుపు ప్రారంభించింది. అప్పటినుంచి ఆ యింటిమీద కాకి,యీ యింటిమీద వాలటం లేదు.

నాకు [illegible]. అంత మంచి కోమలి, అంతబాగా నవ్వగలిగిన కోమలి, ఎప్పట్లా మళ్ళీ ఎందుకు రాకూడదూ? అనిపించింది. సుబ్బుల్ని కోప్పడ్డాను. నువ్వు నవ్వబట్టే ఆవిడకు పౌరుషం వచ్చిందన్నాను. 'అపార్థం చేసుకోకండి కోమలి గారూ! నేను మిమ్మల్ని చూసి నవ్వలేదు. మీవారేదో క్రూరతనపుచేష్ట చేస్తే నవ్వాను. క్షమించండి అని అనమన్నాను. అది నా మాట వింటె ఇహ తోదేముంది? ససేమిరా వెళ్ళనంది. 'అంతేనా?' అని కోపంగా అని వూరుకున్నాను.

ఆ రోజురాత్రి చిట్టిగాడు పాలకోసం చాలా సార్లు లేచాడు. మాకు నిద్రసుఖం పోయింది.

ఒద్దికంగా తెల్లవారింది. ముఖం కడుక్కుని ముందు గదిలోకి వచ్చాను. మా వంశోద్ధారకుడు నా ఎర్రసిరా కలాన్ని చేపట్టి భూమిమీద చిత్రలిపి వ్రాస్తున్నాడు—వాణ్ణి ఒక్కటి — అంటించినంత హడావిడిచేసి చేతిలో కలం లాక్కునే సరికే ఏడుపు లంకించుకున్నాడు. తాషామర్పాల వాద్యనాదం నోటితో పలికించడంలో వాడు ప్రవీణుడు. వాడి విద్య యీవిధంగా నాలుగు గోడలమధ్య నిలిచిపోవడం యిష్టంలేక బుజాన్ని వేసుకుని వీధిలో నుంచున్నాను. అంత వరకూ వీధిలో నిల్చొన్న కోమలిగారు మావాణ్ణి చూసి, [illegible] ఆపుకుంటూను, నవ్వింది.

చిన్నచిన్న విషయాల్లో విరోధాలు పెంచుకోవడం నాకు యిష్టం ఉండదు. ఆడవాళ్ళూ, మొగాళ్ళూ అయినా సరే. ఆడవాళ్ళూ ఆడవాళ్ళూ అయినాసరే! ప్రతి ఒక్కరి హృదయం లోనూ తెరవకూడని తలుపులు కొన్నిఉంటాయి. ఏ దుర్ముహూర్తంలోనో వాటిని తన్ని తెరచి లోకానికి ప్రదర్శించడానికి ప్రయత్నిస్తారు. ప్రదర్శించాలని ప్రయత్నపూర్వకంగా చెయ్యక పోయినా ఒక్కొక్కొక్కప్పుడు వాటంతట అవి తెరుచుకుంటాయి. కోమలిగారి విషయంలో సరిగ్గా అదే జరిగింది. ఆవిడ అందమైనది. అందమైనదనే విషయం ఆమెకు తెలుసు. కనుక జీవితం కూడా అందంగానే ఉండాలని ఉబలాట పడ్డది. గృహిణిగా అది కోరుకోవడం ఆమె కనీసపు హక్కు. ఒంటి రంగుకు తగినట్లుగా అందమైన చీరలు కడుతుంది. చీరలకు సరిపడే జాకెట్లు వేస్తుంది. రోజురోజుకీ, అందంగా వుండే విధంగా ఆకర్షణ తెచ్చుకుంటుంది. భర్త అది చూసి మెచ్చుకోవాలి. తన అలంకరణ వృథా కాకుండా భర్త వాట్ని కాపాడాలి. సినిమాలకీ, షికార్లకీ తీసికెళ్ళాలి. వినోదాలు చూపించాలి. పదిమందిలో తాను అతని ప్రక్కన ఉండి నోటి నిండా నవ్వుకోవాలి.

ఆమె భర్తకు వీటిని పట్టించుకునే తీరిక ఉండదు. పొద్దల్లా ఆఫీసులో పనిచేస్తాడు. ఆఫీసేతర వేళల్లో నాటక పరిభాషలో తప్ప వేరు విధంగా మాట్లాడడంకాని, ఆలోచించడం కాని అతనికి అలవాటులేదు. అందువల్ల ఆమె ప్రాణం ఉసూరుమన్నది. అసంతృప్తి ఏర్పడ్డది. అది ఒక వెలితిగా పసిగట్టి ప్రపంచం తనని ఎక్కడ లోకువ చేస్తుందోనని ఆమె భయం. తనవెలితి కాపాడుకొనడం కోసం కృత్రిమమైన సంతోషం ప్రదర్శిస్తుంది. ఆవిషయం ఒకరు పసిగట్టడం ఏమాత్రమూ యిష్టం ఉండదు. దానికి భంగం కలిగినప్పుడు కార్పణ్యం పెరగడంలో ఆశ్చర్యం లేదు. ఇదీ ఆమె పరిస్థితి.

కుర్రవాణ్ణి తీసుకుని నేను [illegible] వాళ్ళ యింట్లోకి వెళ్ళాను. అంతకుముందు ఎప్పుడూ వెళ్ళలేదు అక్కడికి. ముందుహాల్లో నాలుగు కుర్చీలున్నాయి. దక్షిణంవైపు బల్లమీద ఫిలిప్స్ రేడియో సెట్టున్నది. లేత ఆకుపచ్చ రంగు గుడ్డ దానిమీద కప్పింది. నేను లోపలికి వెళ్ళేసరికి ఆమె నన్ను నవ్వుతో ఆహ్వానించింది. కుర్చీలో కూర్చున్నాను. ఆమె వంటింట్లోకి వెళ్ళింది.

ఎదురుగా గోడమీద సితారల బొమ్మలున్న కాలెండర్లు రెండున్నాయి. వాటికి ఎడమవైపు కాబినెట్ సైజు గ్రూప్ ఫోటో ఒకటుంది. కుర్రవాణ్ణి క్రిందకు దించి గోడదగ్గరకు వెళ్ళి ఫోటో పరిశీలనగా చూశాను. అందులో అర డజను మంది ఆడవాళ్ళున్నారు. మధ్య కోమ[illegible]గారు కూర్చొని ఉన్నారు.

"రసికుడే!" అనిపించింది. కసి! నిజంగా ఆయన రసికుడో కాదో నాకు తెలియదు. కాని ఆరుగురు ఆడవాళ్ల నడుమ కూర్చుని తీయించుకున్న అపూర్వ అవకాశాన్ని ఆయన పొందటంవల్ల నాలో అసూయ కలిగి ఆవిధమైన భావం పుట్టింది. ఒక పరిస్థితిలో ఒకరిమీద పాస్‌చేసే రిమార్కు, అదే పరిస్థితిలో మనమీద యింకొకరు చేయడానికి వీల్లేకుండా ఆత్మగౌరవాన్ని యిన్స్యూర్ చేసినట్లే ప్రతివాడూ మాట్లాడతాడు. అది నాలోపం కాదు. మనుష్యుల మనస్సులు అల్లాంటివి మరి!

కోమలి మావాణ్ణి బుజాన్న వేసుకుని, కాఫీ తీసుకుని చక్కావచ్చింది. "ఎందుకండీ యిప్పుడు కాఫీ? ఇప్పుడె తాగొచ్చాను!"

సున్నితమైన అబద్ధం.

"ఫరవాలేదు తీసుకోండి. వారిప్పుడే ఏదోపని మీద బయటికి వెళ్ళారు. త్వరగానే వచ్చేస్తామన్నారు."

కాఫీ కప్పు తీసుకుంటూ, రేడియోసెట్టు మాట్లాడదామని అనుకుంటూ, తీరా కాఫీరుచి చూసేసరికి ఆవిషయం మర్చిపోయి..."అద్భుతంగా ఉంది!" అన్నాను.

ఆమె నవ్వింది.

అప్పుడు కాఫీ యింకా బాగుంది.

"మీరింత మంచి కాఫీ యిస్తారని తెలిస్తే రోజూ రాకపోయేవాణ్ణా?" అని నవ్వేశాను. ఆమె సిగ్గుపడ్డది. కొండప్రక్కను [illegible] సెలయేరులా వున్నది.

ఏదో మాట్లాడాలి కనుక, " యీయింటి

అద్దె ఎంతిస్తున్నారు?" అని అడిగా.

"అబ్బే! రెండు గదులూ, వంటిల్లూ. చూస్తారా? లోపలికి రండి" అని తాను గదు వెనక్కి వెళ్ళింది. నేనూ వెళ్ళాను. ఇల్లు పెద్ద విశాలంగా లేకపోయినా ఇరుకు అనిపించదు. ఎక్కడ ఉండవలసిన వస్తువులు అక్కడ అమర్చి నట్టున్నాయి. ఇంటిపనుల్లో ఆవిడకున్ననేర్పుకూ ఓర్పుకూ మాఆవిడతో పోలిక సరిపడదు.

ఎదకగది గుమ్మానికి ప్రక్కగా కోమలావు గారు ఎవరో ఒక అమ్మాయితో కలిసి తీయించు కున్నఫోటో ఒకటుంది. బాగుంది. ఆమె కోమలి మాత్రం కాదు. నేను ఆఫోటో వైపు చూడటం గమనించి ఆమె పేలవంగా నవ్వింది. నేను గిల్టీగా ఫీలయ్యాను.

మళ్ళీ హాల్లోకి వచ్చి, "ఇంటి శుభ్రం విషయంలో మీకున్న ఓర్పు చాలా మెచ్చుకో దగింది!" అన్నాను.

ఆమె చీరవైపు చూసుకుని, కుచ్చెళ్ళు సరి చేసుకుని తలెత్తి చూసింది.

అది కనకాంబరం రంగుచీర. మూడువేళ్ల వెడల్పు బోర్డరు ఇంకా మెరుపు పోలేదు. నీలం రంగు చిన్న పువ్వుల అద్దకం రవికె. మెళ్ళో నల్లటి గొలుసుంది. జారుముడి వేసుకోటం వల్ల జుట్టుపొడుగెంతో ఖచ్చితంగా గ్రహించి చెప్పటం కష్టం. ముఖ్యంగా ఆమెలో చెప్పుకోన దగిన ఆకర్షణ పెద్ద ముత్యంవాసి కుంకుమ బొట్టు. అది లేకపోతే దిష్టి తగిలేదేమో!

వెక్కటి ప్రశంస మళ్ళీ మెరుపులా తగిలింది. ఆవిడకు మామీద వచ్చిన కోపం ఎలాగయినా పోగొట్టాలనీ,మళ్ళీ మంచితనంతో మా ఆవిడతో నవ్వుతూ ఆమె మాట్లాడాలనీ నాఆశ.

"మీ దగ్గరున్న నేర్పులో మాఆవిడ కొంత యినా నేర్చుకోగలిగితే చాలా సుఖపడేవాణ్ణి!"

ఆమె ఇటు చూడలేదు.

"మనం చేసే పనులవల్ల ఎదటివారికి అనవ సరంగా నొప్పి కలిగించడం అన్నిటినీ మించిన పాపం!" నేను చెప్పదల్చుకున్నది సరిగా ధ్వనింప జేశాననే అనుకున్నాను.

ఆమె నవ్వబోయింది. కాని అది లోపలే హత్తుకుపోయింది. కొండ వెనకాల చంద్రో దయమైనట్లు. ఆమె ప్రక్కకు తప్పుకుంది.

ఇంతలో కోమలావుగారు ఈడుకుంటూ వచ్చాడు. ఆయన నడకే అంత అసలు.

నన్ను చూసి కొండంత ఉత్సాహం తెచ్చు కున్నాడు. ఏవేవో మాట్లాడాడు. పంచవర్ష ప్రణాళికా నాటకాల్లో వినోదం ఎంత ఉండడానికి అవకాశం ఇయ్యాలో అర్ధగంట మాట్లాడాడు. తరువాత నేను లేచొచ్చేశాను.

నాకు ఆశ్చర్యం కల్గింది. భార్యాభర్తల్లో ఒకరికొకరు తీసిపోయేవాళ్లు కారనిపించింది. అంతగుట్టు! లోపల స్వయంపాకులు.

ఇటువంటి భర్తతో ఆమె ఆరేళ్లనుంచి కాపురంచేస్తుంది. అటువంటి కృత్రిమమైన జీవితాన్ని అతడు పది, పదిహేనేళ్ల నుంచి గడుపు తున్నాడు. అతనిలో మార్పులేదు. ఆమెకు ఇంతవరకూ పిల్లలు లేరు.

కొత్తగా ప్రపంచంలోకి రాబోతున్న జీవుడు దేవుణ్ణి అడిగాట్ట. "సృష్టిలోకల్లా చిత్రమైన దేమిటి?"

"మానవ హృదయం!"

"అన్నిటికంటె గొప్పదేమిటి?"

"మేధస్సు! కావాలంటే నీకదే ఇస్తాను."

"నాకంత గొప్పతనం వద్దు. నాహృదయం నాకిస్తే అదే పదివేలు!"

నవ్వొచ్చింది నాకు. తన యందు అతడు. నిర్లక్ష్యం చూపుతున్నాడని ఆమెకు తెలుసు. ఆమెకు తెలుసునని అతడికీ తెలుసు. కాని ఇద్దరి కిద్దరూ మహానటకులు.

వెనకటిలా కోమలి మళ్ళీ మాయింటికి రావటం లేదుకాని, మావాడు మాత్రం వాళ్లిల్లు వదిలి వస్తూ ఉండేవాణ్ణి. నాటకాల నిర్వహణ కష్టనిష్టురాలూ, స్త్రీపాత్ర ధారిణులు సరిగా సహకరించక పోవడాలూ ఎన్నో విషయాలు కుతూహలంగా చెప్పేవాడు ఆయన. ఎక్కడేనా దొరక్కపోతాడే అనే ధీమాతో నేనూ వినేవాణ్ణి. కోమలి కూడా ఇప్పుడు భర్తసమక్షంలోనే నాతో పిచ్చాపాటి మాట్లాడేటంత చనువు తీసు కుంది.

ఒక రోజున సినిమా చూడాలని బుద్ధిపుట్టి కోమలావుగార్ని కూడా రమ్మని ఆహ్వానించాను.

తీరా బయలుదేరే సమయానికి కోమలి కూడా వస్తానంది. సరేనన్నాడు అతగాడు.

సినిమా ప్రారంభం అయిన కొద్ది సేపటికే ఇప్పుడే వస్తానంటూ బయటికి వెళ్ళాడు. నాకూ, కోమలిగారికీ మధ్యసీటు కాళీగా ఉంది. నేను కుడిచెయ్యి వెనక్కి వేసుకుని కూర్చున్నాను. చేతికేదో పొడుగ్గా తగిలింది. నేను చెయ్యి తీసు కునేలోగా కోమలి తల కదిలింది. పొడవాంటి ఆమె జడ రివ్వున పైకిలేచి నామొహకు తగిలింది. తలలో తురుముకున్న మల్లెలు గుప్పుమన్నాయి. అప్పుడు నేనామెవైపు చూసిన చూపు! అదొక చిత్రమైన అనుభవం. జడ సరిచేసుకుని, ఆపరిస్థితిలో నావైపు కోమలి వింతగా నవ్వింది. ఆలా, ఆనవ్వు నేను ఇంకా చూస్తూ ఉండగానే కోమలావుగారు మధ్యకుర్చీలో సాక్షాత్కరించాడు సినిమాలో విషాద సంగీతం వినిపిస్తోంది. అప్పటికి పదిరోజులు తిరక్కుండానే కోమలావుగారి ఆఫీసులో టైపిస్టు అమ్మాయి పెళ్లిచేసుకుందట పరిషత్తు పోటీలకు తీసుకెళ్లబోయే నాటకం 'ఫ్లాప్' అయే ప్రమాదం కూడ వచ్చిందట!

రెన్నెళ్ల తరవాత మా ఆఫీసువాళ్లు నన్ను బొంబాయి ట్రెయినింగుకి పంపించారు. మా సుబ్బులు వాళ్ల పుట్టింటికి వెళ్లింది.

సాధారణంగా మా సుబ్బులు ఉత్తరాలు రాయదు. నేను బొంబాయిలో ఉన్న ఆర్నెళ్లలోనూ అరడజను ఉత్తరాలు రాసింది. ప్రతి ఉత్తరంలోనూ కోమలి విషయం ఏదో ఒకటి రాయకుండా ఉండేదికాదు. కోమలిగారూ, మీకోమలీ, పాపంకోమలి! ఇల్లా ఉండేవి ఆమె సంబోధనలు. తెగనవ్వుకునేవాణ్ణి! ఒకసారి కోమలావుగారు కూడా వ్రాశారు. తెలుగు నాటకరంగాన్ని ఇహ బాగుచేయడం తన వల్ల కాదనీ, శాశ్వతంగా రంగంనుంచి నిష్క్రమిస్తు న్నాననీని!

ట్రెయినింగు పూర్తి అయి తిరిగొచ్చేసరికి సుబ్బులు కూడా పుట్టింటినుంచి రెండురోజులు ముందే వచ్చింది.

గొల్లోకి వచ్చాక కొత్త విషయం ఒకటి చెప్పింది సుబ్బులు.

"మీ కోమలికి ఏడో మాసంట!"

నమ్మలేనంతగా ఆశ్చర్యపోయి నోరుతేల వేశాను.

"ఏడు అని ఆవిడ అందికానీ, ఎనిమిదోమాసం దాటినట్లే కనిపిస్తుందిలెండి! అగ్నిపరీక్ష?"

ఇంతలో కుర్రాణ్ణి చంకనేసుకుని కోమలే గుమ్మంలో అడుగుపెట్టింది.

మనిషి బాగా లావయింది. బుగ్గలొచ్చాయి. నడకలో బరువైన టివి వచ్చింది. కళ్లల్లో ఏదో కొత్త మెరుపు కనిపిస్తోంది. అందులో పరిపూర్ణ మయిన కాంతి ఉంది. సౌందర్య సామ్రాజ్యానికి వచ్చింది కోమలి!

కోమలి చటుక్కున నన్ను చూసింది..

నవ్వింది.

ఆ నవ్వు!

గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్లిపోయింది. పోతూ చిట్టిగాణ్ణి గట్టిగా ముద్దుపెట్టుకుంది.

ఆ మర్నాడే ఇల్లు కాళీచేసి మరో ఇంట్లోకి వెళ్లాలని సుబ్బులు పట్టుపట్టింది. అంత అర్జంటుగా ఇల్లు మారిపోడానికి ప్రబలమైన కారణమేమిటో నేను ఊహించుకోలేకపోయాను. ఆడవాళ్ల మనస్సులలో లోతులు మనకు అందవు. ఇంటిమీద ఆవిడకోపానికి కారణమేమైనా నాకు ఎప్పటికీ జ్ఞాపకం ఉండే దొక్కటే!

"కోమలి నవ్వింది!"

★


## కావలెను

కాలవలకు పార్టు టైం ఏజంట్లు కావలెను. వివరములకు, ఫ్రీ కాంపిల్సుకు వ్రాయండి.

GIRSON KNITTING WORKS, LUDHIANA(201)